
# సాక్షి చిత్తూరు

శనివారం ၊ 27 ၊ మే ၊ 2023



**సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం**

ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలని 'జగనన్నకు చెబుదాం' స్పెషల్ ఆఫీసర్ వీరపాండ్యన్ శుక్రవారం ఆదేశించారు. - 10లో



**వరసిద్ధుని సేవలో ప్రముఖులు**

వినాయకుని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, తెలంగాణ మంత్రి ఈశ్వర్ ఉన్నారు. - 10లో

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| చిత్తూరు | 38 | 27 |
| తిరుపతి | 40 | 28 |
| తిరుమల | 35 | 24 |
| గూడూరు | 42 | 30 |
| నగరి | 41 | 28 |

## న్యూస్‌రీల్

### మెడికల్ సర్టిఫికెట్ దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తుల పరిశీలనలో అధికారులు

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం టీచర్ల మెడికల్ సర్టిఫికెట్ దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైంది. బదిలీల నేపథ్యంలో ఉపాధ్యాయుల నుంచి వచ్చిన దరఖాస్తులను మెడికల్ బోర్డు సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

### బోయకొండలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### హజ్ యాత్రికులకు శిక్షణ రేపు

పుంగనూరు : జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళుతున్న ముస్లింలకు పట్టణంలోని ఉర్దూ స్కూల్‌లో ఆదివారం శిక్షణ ఇవ్వనున్నట్లు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్ సలీం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అలాగే హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ చేయించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొననున్నట్లు వివరించారు.

### ఉద్యోగోన్నతులకు కౌన్సెలింగ్



టీచర్లకు ఆప్షన్ ఫారమ్ అందిస్తున్న ఉపాధ్యాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఉపాధ్యాయులకు శుక్రవారం డీఈఓ కార్యాలయంలో ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ గణితం సబ్జెక్టులో 21 మంది టీచర్లు పలు పాఠశాలలను కోరుకున్నారని, మిగిలిన సబ్జెక్టులకు సంబంధించి అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని వెల్లడించారు.

### ఏనుగుల బీభత్సం



బైరెడ్డిపల్లి : ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలు

పెద్దపంజాణి: మండలంలోని గుత్తివారిపల్లెలో ఏనుగులు గురువారం రాత్రి బీభత్సం సృష్టించాయి. కీలపట్ల బీటు నుంచి వచ్చిన నాలుగు ఏనుగులు దున్నేకుంటకింద రామయ్య, గుత్తి చిన్నప్ప, గురుమూర్తి సుధాకర్ అనే రైతుల వరి పైరును తొక్కి నాశనం చేశాయి. రామయ్య, చలపతి అనే రైతులకు చెందిన మామిడి తోటలను ధ్వంసం చేశాయి. చేతికొచ్చే దశలో పంట నష్టపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని పాలకల పంచాయతీ యల్లంపల్లెలో గురువారం రాత్రి ఏనుగుల గుంపు మామిడి తోటలను నాశనం చేశాయి. యల్లంపల్లెకు చెందిన లీలారాణి, శంకరయ్య అనే రైతుల మామిడి తోటలో చెట్లను విరిచేశాయి. బోరు పైపులను ధ్వంసం చేసేశాయి. శివరాజా అనే రైతుకు చెందిన పశుగ్రాసాన్ని తొక్కేశాయి. ఏనుగుల దాడిలో సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు వెల్లడించారు.

### చిత్తూరు వెస్ట్ సీఐ బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాసులురెడ్డిని బదిలీ చేస్తూ పోలీసు శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ కడప జిల్లా ఏసీబీ విభాగానికి శ్రీనివాసరెడ్డి నియమిస్తున్నట్లు పేర్కొంది.

అవనిలో సగం.. ఆకాశంలో సగం.. ఏ రంగంలోనైనా రాణిస్తాం.. అని నిరూపిస్తున్నారు నేటి నారీమణులు. ఒకప్పుడు వంటింటి కుందేళ్లుగా అణచివేతకు గురైన మహిళలు ఇప్పుడు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ 'మేము సైతం' అంటూ దూసుకుపోతున్నారు. అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని అందిపుచ్చుకుని అర్చకత్వంలోనూ రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో శుభకార్యాలు చేస్తూ విశిష్ట గౌరవాన్ని సంపాదించుకుంటున్నారు. ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.. పిచ్చాటూరు మండలం, కీళ్లపూడి గ్రామానికి చెందిన మహిళా అర్చకులు.

కీళ్లపూడిలో గృహ ప్రవేశ కార్యక్రమంలో అర్చకులుగా కల్పన



జలకంఠేశ్వరునికి హారతి ఇస్తున్న అర్చకురాలు నాగమణి



# సంప్రదాయాన్ని పాటిస్తూ.. అర్చకులుగా 'రాణి'స్తూ..!

- అర్చకులుగా తల్లి, కుమార్తె, మనవరాలు
- ఆలయాలతో పాటు శుభకార్యాలకు అర్చకత్వం
- ఏ రంగంలోనూ తీసిపోమంటున్న బ్రాహ్మణ కుటుంబం
- మూడు దశాబ్దాల సంప్రదాయం

సాక్షి, తిరుపతి డెస్క్

పిచ్చాటూరు మండలం, కీళపూడిలో శ్రీభవానీదేవి సమేత జలకంఠేశ్వరాలయం, శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయాలతో పాటు, పిచ్చాటూరులోని శ్రీనాగాలమ్మ దేవాలయాల్లో నిత్యపూజలు నిర్వహిస్తుంటారు. ఆయా ఆలయాల్లో కీళ్లపూడి గ్రామానికి చెందిన మహిళా అర్చకులే పూజలు చేస్తుంటారు. పురాతన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నారు.

**1993 నుంచి నిత్య పూజలు**

1990లో అరణియార్ జలాశయం మధ్యలో కీళపూడి గ్రామానికి చెందిన హరిశ్చంద్ర రాజు పొలాన్ని దున్నుతుండగా శివలింగం బయటపడింది. ఈ శివలింగాన్ని ప్రాజెక్టు ఒడ్డున ఓ రావి చెట్టు కిందకు తరలించారు. మూడేళ్ల తర్వాత ఆ చెట్టు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్డు ఏర్పాటు చేసి అందులో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అరణియార్ ప్రాజెక్టు జలం(నీరు) కింద శివలింగం లభించినందున శ్రీ భవానీ దేవి సమేత జలకంఠేశ్వర స్వామిగా నామకరణం చేశారు. ఇలా ఏర్పడ్డ ఈ ఆలయంలో నిత్యపూజలకు అదే గ్రామంలోని ఓ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సరోజమ్మను అర్చకురాలిగా నియమించారు. అలా మొదలైన ఈ అర్చకత్వం తన భర్త బతికి ఉన్న సమయంలో ఆయన ద్వారా అర్చకత్వం అభ్యసించారు. సరోజమ్మ తన పౌరోహిత పటిమతో ఆలయ అభివృద్ధికి తోడ్పడారు. ఆ సమయంలో ఆమెకు ఏడేళ్ల వయస్సు గల మనవడు సుబ్రమణ్యం, ఎనిమిదేళ్ల వయస్సు ఉన్న మనవరాలు కల్పన పూజలకు సహకరించేవారు. 2013లో మనవరాలు కల్పనకు వివాహం జరిగింది. 2014లో సరోజమ్మ కుమార్తె నాగమణి నాగమణి సైతం తల్లితో కలిసి జలకంఠేశ్వర స్వామి ఆలయంలో నిత్యపూజల్లో పాల్గొంటూ అర్చకత్వం వైపు అడుగులు వేశారు. మనవరాలు కల్పన 2015లో తన భర్తతో కలిసి కీళపూడికి విచ్చేసి ఇక్కడే కాపురం పెట్టారు. అపై వృద్ధాప్యం కారణంగా 2017లో సరోజమ్మ శివైక్యం చెందారు. అప్పటి నుంచి తన మేనత్త నాగమణి, కోడలు కల్పన జలకంఠేశ్వర ఆలయంలో అర్చక స్వాములయ్యారు. తదనంతరం ఆలయ అభివృద్ధిలో భాగంగా షిర్డీ సాయిబాబా ఆలయాన్ని కూడా నిర్మించారు.



అభయాంజనేయ స్వామి ఆలయంలో ..



కుంభాభిషేకంలో మంత్రి దంపతులకు స్వాగతం పలుకుతూ..

**ఆధ్యాత్మిక 'కల్పన'**

అదే గ్రామానికి చెందిన వెంకట్రాజు రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్. ఉద్యోగ విరమణతో వచ్చిన రూ.9 లక్షల పాటు దాతల విరాళంతో 2019లో శివాలయం పక్కనే శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం నిర్మించారు. ఈ ఆలయంలో అర్చకత్వ బాధ్యతలను కల్పనకు అప్పజెప్పారు. 2020లో పిచ్చాటూరు టీచర్స్ కాలనీ సమీపంలో స్వయంభు శ్రీ నాగాలమ్మ ఆలయం నిర్మించగా.. అందులోనూ ఆమెనే అర్చకులుగా నియమించారు. ప్రస్తుతం ఈ రెండు ఆలయాల్లో కల్పన అర్చకులుగా నిత్య పూజలు చేస్తుండగా, శ్రీ జలకంఠేశ్వరాలయం, షిర్డీ సాయిబాబా ఆలయాల్లో నాగమణి అర్చకత్వం వహిస్తున్నారు.

**అభివృద్ధి పథంలో ఆలయాలు**

మహిళా అర్చకులుగా ఉన్న ఆలయాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. సెంటు భూమిలో రేకుల షెడ్డులో ప్రారంభమైన కీళపూడిలోని శ్రీ జలకంఠేశ్వర ఆలయం ప్రస్తుతం సుమారు ఎకరం విస్తీర్ణంలో శివాలయంతో పాటు షిర్డీ సాయిబాబా ఆలయం, అనుబంధంగా ఓ కళ్యాణ మండపం రూపుదిద్దుకుంది. ఆలయ సత్రంలో వివాహాలు, శుభకార్యాలు, తిరుమల యాత్రికులు సేద తీరడానికి విడిదిగా ఉపయోగపడుతోంది. పక్కనే ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం మండలం ప్రారంభంలో, రోడ్డుకు ఆనుకొని ఉంది. ఈ కారణంగా భక్తులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు ఇక్కడ ఆపి పూజలు చేసి వెళ్తుంటారు. ఇక నాగమ్మ ఆలయ కుంభాభిషేకానికి గత నెల రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే ఆదిమూలం హాజరయ్యారు.

**శుభకార్యాలకు అర్చకత్వం**

ఆలయాల ద్వారా సుపరిచితులైన కల్పనను గృహ ప్రవేశాలు, సత్యనారాయణ వ్రతం, గణపతి హోమం వంటి పూజలకు ఆహ్వానిస్తుంటారు. వీటితో పాటు పెళ్లిళ్లు సైతం జరిపిస్తుంటారు.

**అందరి ప్రోత్సాహం వల్లే**



నా భర్తతో పాటు అందరి సహకారం వల్లే అర్చకత్వంపై ఆసక్తి పెరిగింది. దేవునిపై భక్తి శ్రద్ధలతో చేసే పని ఏదైనా నిష్ఠతో చేయాలన్నదే మా పెద్దలు నాకు నేర్పించారు. స్వామి వారి సేవలో అర్చకురాలిగా కొనసాగడం దేవుడు ఇచ్చిన వరం. రుతుక్రమం సమయంలో ఆలయానికి, అర్చకత్వానికి దూరంగా ఉంటా. గత ఏడేళ్లుగా గృహ ప్రవేశాలు, గణపతి హోమం, సత్యనారాయణ వ్రతం, ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవాలకు వెళ్తున్నా.

–కల్పన, అర్చకురాలు, కీళపూడి గ్రామం

**అమ్మ అర్చకత్వాన్ని కొనసాగిస్తా**



మా అమ్మ సరోజమ్మ నాకు అప్పజెప్పిన అర్చకత్వాన్ని నా చివరి జీవితం వరకు కొనసాగిస్తాను. శ్రీ జలకంఠేశ్వర స్వామికి సేవచేస్తూ, ఆలయానికి వచ్చే భక్తులకు సేవలందిస్తా. ఆలయ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా.

–నాగమణి, అర్చకురాలు, కీళపూడి

## గరుడునిపై ఇంద్రవరదుని విహారం



గరుడవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

యాదమరి: ఇంద్రవరదుని ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజామునే శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి అర్చకులు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి గరుడునిపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూరనీరాజనాలు సమర్పించారు.

**కల్పవృక్ష వాహనసేవ**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి కల్పవృక్ష వాహనంపై ఉభయ దేవేరీ సమేతంగా శ్రీవారంత కొలువుదీరారు. పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం హనుమంత వాహన సేవ, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గజవాహన సేవ జరిపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పకడ్బందీగా భూముల రీసర్వే



పులిచెర్ల : భూ రికార్డులను పరిశీలిస్తున్న వీరపాండ్యన్

పులిచెర్ల(కల్లూరు): భూముల రీసర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి వీరపాండ్యన్ ఆదేశించారు. శుక్రవారం పులిచెర్ల మండలం రెడ్డివారిపల్లెలో సాగుతున్న రీసర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో తప్పులకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కల్లూరు పీహెచ్‌సీలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ ప్రకాశం, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, తహసీల్దారు అమరనాథ్, ఎంపీడీఓ సుగుణమ్మ, సర్పంచ్ రాణెమ్మ పాల్గొన్నారు.

**రైతులందరికీ సబ్సిడీపై విత్తనాలు**

రొంపిచెర్ల: ప్రతి రైతుకూ సబ్సిడీపై విత్తనాలు అందించాలని వీర పాండ్యన్ ఆదేశించారు. రొంపిచెర్ల సచివాలయం, రైతుభరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఖరీఫ్‌లో వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. సచివాలయంలో సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. జేడీ మురళీకృష్ణ,ఏడీఏ శివకుమార్ పాల్గొన్నారు.

## సకాలంలో రైతులకు పరికరాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : రైతులకు సకాలంలో వ్యవసాయ పరికరాలను అందజేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్లాంటేషన్, పట్టుగూళ్ల షెడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ మంజూరు చేయాలని సూచించారు. పట్టుగూళ్ల ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలని జేడీకి స్పష్టం చేశారు. బిందు సేద్యం పరికరాలను రైతులకు పంపిణీ చేయాలని కోరారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు కావలసిన విత్తనాలను అందజేయాలన్నారు. కూరగాయలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తనాలు, అంతర్ పంటలు వేసుకోవడానికి చిరుధాన్యాల విత్తనాలను పంపిణీ చేయాలని సూచించారు. పశువుల దాణా విషయంలో ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని పరిశీలించాలని పశు సంవర్ధక శాఖ జేడీని ఆదేశించారు. మత్స్య శాఖ ద్వారా చేపల అభివృద్ధికి పలు పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. చేపల వ్యాపారులకు మేలు కలిగేలా పలు ప్రాంతాల్లో అమ్మక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఉద్యాన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి శోభారాణి, మత్స్యశాఖ డీడీ రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**భూసేకరణకు చర్యలు**

చెన్నై– బెంగళూరు, చిత్తూరు – తచ్చూరు జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హైవే, రెవెన్యూ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ జాప్యం కారణంగా పలు ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం సాగడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో ఆయా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పక్కాగా పరిహారం పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్, ఆర్డీఓలు రేణుక, శివయ్య పాల్గొన్నారు.

## జనం హృదయంలో జగనన్న



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలను అమలు చేసి జనం హృదయంలో నిలిచిపోయారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు.

**నారావారిపల్లెలో దళితులకు ఆలయ ప్రవేశం లేదు**

చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లెలో ఇప్పటికీ దళితులకు ఆలయ ప్రవేశం లేదని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మండిపడ్డారు. జీడీ మండలం ఆవుకొండ ముస్లిం కాలనీలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబుకు దళితులంటే గిట్టదని, వారి అభివృద్ధిని ఓర్వలేరని విమర్శించారు. ఓట్ల కోసం కులాల మధ్య చిచ్చు పెడతారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంటే అన్నివర్గాల ప్రజలు ఆప్యాయంగా ఆహ్వానిస్తున్నారని, కేవలం బాబు సామాజిక వర్గం వారు మాత్రమే బాబు, లోకేష్‌ల ఆదేశాలతో ఇంటికి తాళాలు వేసి దాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత ఎమ్మెల్యే పర్యటిస్తే గోమూత్రం, పసుపు నీళ్లతో శుద్ధి చేయించడం కుల వివక్ష కాదా..? అని ప్రశ్నించారు. చంద్రబాబుకు అధికారమిస్తే రిజర్వేషన్లను రద్దుచేసి, బడుగు, బలహీనవర్గాలను అణగదొక్కుతారని ఆరోపించారు. టీడీపీలోని దళిత సోదరులు మౌనం వీడాలని, వివక్షపై ప్రశ్నించాలని సూచించారు.

**ఎస్సీ ఓటర్లను అడ్డుకున్న ఘనుడు చంద్రబాబు**

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీలు ఓటేయకుండా 2019 సార్వత్రిక ఎన్నికల్లో అడ్డుకున్న ఘనుడు చంద్రబాబు అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. శుక్రవారం చిత్తూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో జనం సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు పర్యటిస్తుంటే వారిని అడ్డుకోమని చంద్రబాబు పిలుపునివ్వడం దారుణమన్నారు. ప్రతిపక్ష నేతల కుట్రలను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. జీడీ నెల్లూరు, పూతలపట్టు మండలాల్లో జరిగిన ఘటనలపై హైకోర్టు, సుప్రీం కోర్టులు సుమోటాగా విచారణ చేపట్టాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు ఓట్లు వేస్తేనే తాము గెలుపొందామని, వారి సమస్యలను తీర్చాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు. ఎమ్మెల్యే టికెట్ కోసం ఆశావహులు రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లు ఇవ్వాలని చంద్రబాబునాయుడు ఎందుకు కోరుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.

# ప్రాజెక్టుల జోలికొస్తే సహించం



చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం



ర్యాలీలో నాగభూషణం, వెంకటరెడ్డి యాదవ్ తదితరులు

- ఉద్యమించిన పుంగనూరు ప్రజలు
- చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

పుంగనూరు : తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు అందించేందుకు నిర్మిస్తున్న ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె ప్రాజెక్టులను చంద్రబాబు అడ్డుకుంటే సహించే ప్రసక్తే లేదేని పుంగనూరు వాసులు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో ర్యాలీ నిర్వహించి, ఇందిరా సర్కిల్ వద్ద ధర్నాకు దిగారు. అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జానపద కళల సంస్థ అధ్యక్షుడు కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, లయన్స్‌క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ పాల్గొన్నారు.

**పద్నాలుగేళ్లు ఉన్నా ప్రయోజనం శూన్యం**

పద్నాలుగేళ్లపాటు చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసినా జిల్లాకు ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదని కొండవీటి నాగభూషణం స్పష్టం చేశారు. పడమటి నియోజకవర్గాలలో ఒక్క తాగునీటి ప్రాజెక్టు కూడా నిర్మించలేదని ఆరోపించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇప్పుడు ప్రాజెక్టులు నిర్మిస్తుండడంతో ఓర్వలేకే తప్పుడు కేసులు వేసి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పడమటి నియోజకవర్గాలకు నీరు రాకుండా అడ్డుపడితే టీడీపీని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. వెంకటరెడ్డి యాదవ్ మాట్లాడుతూ ప్రాజెక్టులకు మోకాలడ్డితే నష్టపోయేది ప్రజలనే విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, ఇష్తికార్, ఇంతియాజ్, గౌస్, లక్ష్మణ్‌రాజు, కిషోర్, శ్రీనివాసులు, రమణ, సూరి, కౌన్సిలర్లు నటరాజ, కిజర్‌ఖాన్, రేష్మా, సాజిదాబేగం, నరసింహులు, మనోహర్, భారతి, జేపీ యాదవ్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### టీడీపీ నేత కుటుంబానికి వైఎస్సార్ బీమా



రమేష్‌బాబు కుటుంబానికి నగదును అందిస్తున్న సర్పంచ్ దివ్య

కార్వేటినగరం: ఆర్కేవీబీపేట మాజీ సర్పంచ్(టీడీపీ) రమేష్‌బాబు కుటుం బానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని సర్పంచ్ దివ్య అందించారు. అనారోగ్యంతో రమేష్‌బాబు శుక్రవారం మృతి చెందారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలను సర్పంచ్ దివ్య అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీమా మిగిలిన మొత్తం రూ.90 వేలు చెక్కు రూపంలో ప్రభుత్వం త్వరలో అందిస్తోందని పేర్కొన్నారు. కార్యదర్శి లోకేష్, సంక్షేమ, విద్యా సహాయకురాలు జ్యోతి, వలంటీర్ గిరిబాబు, వార్డు మెంబర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

### 29న సఫాయి కర్మచారి జిల్లా పర్యటన

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర సఫాయి కర్మచారి చైర్మన్ వెంకటేశన్ ఈనెల 29న జిల్లా కేంద్రంలో పర్యటిస్తారని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటిస్తారని తెలిపారు.

### మామిడి తోటకు నిప్పు

ఐరాల: మండలంలోని గుట్టపాళ్యంలో సురేంద్రనాయుడు, నరసింహానాయుడు అనే రైతులకు చెందిన మామిడి తోటకు శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. 22 మామిడి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. దీంతో సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

# జగనన్నకు చెబుదాంపై విస్తృత ప్రచారం

- త్వరలో ప్రతి గడపకు మహిళా పోలీస్
- జిల్లాలో నేరాల సంఖ్య తగ్గించాలి
- క్రైమ్ సమీక్షలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్ రెడ్డి

చిత్తూరు అర్బన్ : 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి టోల్ ఫ్రీనంబర్-1902కు వచ్చే ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ రిశాంత్ రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలో తన కార్యాలయంలో శుక్రవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. మహిళలు, పిల్లల రక్షణే ధ్యేయంగా త్వరలో 'ప్రతి గడపకు మహిళా పోలీస్' కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాల కేసులను త్వరితగతిన ఛేదించాలన్నారు. ప్రజలతో సామరస్యంగా, సఖ్యతతో మెలగాలని తెలిపారు. ఎర్రచందనం, సారా, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు మెరుగైన చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. మహిళా పోలీసులచే మహిళలు, బాలికలకు సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్య పరచాలని తెలిపారు. బీట్ వ్యవస్థను మెరుగుపరచి శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణకు కృషి చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సుధాకర్, ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని 'జగనన్నకు చెబుదాం' స్పెషల్ ఆఫీసర్ వీరపాండ్యన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయిలో 80 శాతం సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 1902కు వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఇకపై ప్రతి నెలా రెండు పర్యాయాలు జిల్లాలో పర్యటిస్తానని వెల్లడించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. సమీక్షలో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, ఆర్డీఓ రేణుక, డీఆర్‌డీఏ పీడీ తులసి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజా, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

# ఇరువర్గాల ఘర్షణలో 11 మందిపై కేసు



మాట్లాడుతున్న సీఐలు శ్రీధర్, రియాజ్ అహ్మద్

కుప్పంరూరల్ : పట్టణంలో గురువారం ఉదయం జరిగిన ఘర్షణకు సంబంధించి 11 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐలు శ్రీధర్, రియాజ్ అహ్మద్ తెలిపారు. నిందితుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం రాత్రి కొత్తపేటలో మునస్వామి, వాసు వర్గీయుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుందన్నారు. దీన్ని మనసులో పెట్టుకుని గురువారం ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారని, వాసు తీవ్రంగా గాయపడ్డాడని వివరించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు శివకుమార్, శ్రీకాంత్ ఉన్నారు.

### వడదెబ్బతో గ్రీన్ అంబాసిడర్ మృతి

విజయపురం(నగరి) : మండలంలోని పాతర్కాడు గ్రామంలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న కృష్ణయ్య (60) వడదెబ్బకు గురై శుక్రవారం మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం విధి నిర్వహణలో ఉండగా కృష్ణయ్య వడదెబ్బకు గురయ్యాడు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించి ఇంటికి తీసుకొచ్చామని, శుక్రవారం ఉదయం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.



### పిడుగుపాటుకు మేకల మృతి



మేకల కళేబరాలు

రొంపిచెర్ల : మండలంలోని చిచ్చిలివారిపల్లె పంచాయతీ సమీపంలోని అటవీప్రాంతంలో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు గురై నాలుగు మేకలు మృతి చెందాయి. వివరాలు.. కొత్తపల్లెకు చెందిన ఎస్.నరసింహులు (28) మేకలను మేతకు తోలుకెళ్లిన సమయంలో పిడుగు పడింది. దీంతో నాలుగు మేకలు అక్కడికక్కడే మరణించాయి. నరసింహులు తీవ్రంగా గాయపడడంతో కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన మేకల విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని తెలిపారు. దీనిపై తహసీల్దార్ అమరనాథ్, పశు వైద్యాధికారి శ్రీధర్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు పరిహారం కోసం ప్రతిపాదనలు పంపుతామని అధికారులు హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి పరామర్శించారు.

### చికిత్స పొందుతూ పోస్టల్ ఉద్యోగి మృతి



కార్తీక్ (ఫైల్)

చౌడేపల్లె : మండలంలోని పందిళ్లపల్లె బ్రాంచి పోస్టాఫీసులో ఏబీపీఎంగా పనిచేస్తున్న ఎం.కార్తీక్(23) చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమణ తెలిపారు. వివరాలు.. సోమల మండలం యర్రంవారిపల్లెకు చెందిన కార్తీక్ రెండేళ్లుగా ఏబీపీఎంగా పనిచేస్తున్నాడు. గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతూ తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల అనారోగ్యంతోపాటు, ఇతర సమస్యలు అధికం కావడడంతో మనస్తాపం చెంది ఈ నెల 24వ తేదీన బోయకొండ వద్ద విషం తాగేశాడు. తిరుపతి స్విమ్స్‌లో చికిత్సపొందుతూ మరణించాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

కార్వేటినగరం : మండలంలోని కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఉదయం ఓ లారీ బోల్తా పడింది. వివరాలు.. టమాటా లోడ్‌తో పుత్తూరు మార్గంలో చిత్తూరు వైపు వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో లారీలోని టమాటాలు రోడ్డుపై పడిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చిల్లకూరు: బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వివరాల మేరకు.. గూడూరు పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు మండలంలోని చింతవరం గ్రామానికి వెళ్లి తిరిగి గూడూరుకు బయలుదేరారు. నాంచారమ్మపేట వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్‌పై బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురిలో ఇద్దరు జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రయివేటు వాహనాల్లో నెల్లూరుకు తరలించారు. వారి పేర్లు, వివరాలు తెలియరాలేదు.

### అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

భాకరాపేట : అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన ఘటన మండలంలో వెలుగు చూసింది. పోలీసుల కథనం.. చిన్నగొట్టిగల్లు మండలం, చిట్టేచెర్ల పంచాయతీ దాసరగూడెంకు చెందిన సుబ్రమణ్యం కుమార్తె మీనా(22) మూడు రోజులుగా కనబడక పోవడంతో తల్లిదండ్రులు భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలోని కుంటలో నీటిపై తేలియాడుతున్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. భాకరాపేట పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, దాసరగూడెంకు చెందిన మీనాగా గుర్తించారు. చీకటి పడడంతో మృతదేహాన్ని వెలికితీయలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

### రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

కుప్పంరూరల్ : కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి రైలు ఢీ కొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. రైల్వేహెడ్ కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు.. పాత రైల్వే గేటు వద్ద ఓ వృద్ధురాలు (సుమారు 50) పట్టాలు దాటుతుండగా, రైలు ఢీకొంది. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



చిత్తూరు బులియన్

బంగారం :

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.62,350 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,600 |

వెండి:

| | |
|---|---|
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.74,000 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.76 |

# వరసిద్ధుని సేవలో ప్రముఖులు



ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వారిని శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి, తెలంగాణ మంత్రి కొప్పుల ఈశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా సేవించుకున్నారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి వారికి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

### రోడ్డుపై ఆగిపోయిన లారీ

ఏర్పేడులో గంటకు పైగా ట్రాఫిక్ స్తంభన



జేసీబీతో లారీని తొలగిస్తున్న దృశ్యం

ఏర్పేడు: మండల కేంద్రంలోని వెంకటగిరి రోడ్డులో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో లారీ మరమ్మతులకు గురై ఆగిపోవడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వెంకటగిరి నుంచి తిరుపతికి వస్తున్న లారీ ఏర్పేడు మండల కేంద్రంలో రోడ్డుపై మరమ్మతులకు గురైంది. దీంతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు భారీగా ఆగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. గంటకు పైగా ట్రాఫిక్ జామ్‌లో వాహదారులు, ప్రయాణికులు ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీహరి ఘటన స్థలానికి చేరుకున్నారు. జేసీబీతో లారీని రోడ్డు పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధించారు.

# కర్ణాటక మద్యం పట్టివేత

– రెండు కార్ల సీజ్, ఇద్దరి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్ : నగరంలో శుక్రవారం అర్బన్ ఎస్‌ఈబీ అధికారులు కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి వివరాలు వెల్లడించారు.ఏఈఎస్ అయేషా బేగం, ఎస్‌ఈబీ సీఐ వై జోగేంద్ర తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారన్నారు. తేనెబండకు చెందిన జయశంకర్, సౌందర్‌రాజన్ అనే నిందితులు కర్ణాటక మద్యంతో పట్టుబడినట్లు తెలిపారు. సిద్ధికి, కుమార్ అనే ఇద్దరు పరారైనట్లు చెప్పారు.. నిందితుల నుంచి రూ.1.20 లక్షల విలువైన 2,688 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండు కార్లు సీజ్ చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాబు, రాంప్రసాద్, సిబ్బంది బాబు, శంకర్ నాయక్, జయశంకర్, వెంకటేష్, సురేంద్ర పాల్గొన్నారు.

# నాలుగు పూరిళ్లు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన పూరిళ్లు



నిత్యావసరాలు అందిస్తున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం : మండలంలోని అముదాల పంచాయతీ గొల్లకండ్రిగ బీసీ కాలనీలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. వేసవి నేపథ్యంలో మంటలు అదుపు కాలేదని, ఇళ్లలోని దుస్తులు, బియ్యం, వంట సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితులు వాణిశ్రీ, జమున, గీత, దివ్య తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ బాబు, సర్పంచ్ అనురేఖ, ఎంపీటీసీ సభ్యులు లిఖిత ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు నిత్యావసరాలు అందించారు. అలాగే ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# సర్పంచ్ భర్తపై దాడి

– ఆరుగురిపై కేసు



బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

రామకుప్పం: మండలంలోని మణీంద్రం సర్పంచ్ ఉషారాణి భర్త చంద్రమోహన్ రెడ్డిపై దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. కిలాకిపోడు సమీపంలోని మామిడితోటలో బెంగళూరుకు చెందిన వెంకటరమణారెడ్డి, గీతారెడ్డి, వింధ్యారెడ్డి శుక్రవారం మరో ముగ్గురితో కలసి మామిడికాయలు కోస్తుండగా చంద్రమోహన్ రెడ్డి వారించారు. దీంతో వారు ఆగ్రహించి మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. గాయపడిన చంద్రమోహన్ రెడ్డిని స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆరుగురు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భూతగాదాల నేపథ్యంలో దాడి జరిగినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

# లారీని ఆపి పంక్చర్ వేయిస్తుండగా..

- వెనుక నుంచి ఢీకొన్న మరో లారీ..
- ఒక డ్రైవర్ మృతి, మరొకరికి గాయాలు

పాకాల : మండలంలోని కోనప్పరెడ్డిపల్లె వద్ద రోడ్డు పక్కన ఆపి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒక డ్రైవర్ మృతి చెందగా, మరో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం, నల్గొండ జిల్లా, త్రిపురారం మండలానికి చెందిన కిషన్ కుమారుడు డ్రైవర్ ముదావత్ లక్ష్మణ్(35) బియ్యం లోడు లారీతో మిరియాలగూడ నుంచి చిత్తూరుకు బయలుదేరాడు. మండల పరిధిలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలోని కోనప్పరెడ్డిపల్లి వద్ద లారీ పంక్చర్ అయ్యింది. లారీని రోడ్డు పక్కగా ఆపి లక్ష్మణ్ పంక్చర్ వేయిస్తున్నాడు. ఈ సమయంలో మామిడి కాయల లోడ్‌తో వేగంగా వస్తున్న లారీ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీ కొనడంతోపాటు ఈ లక్ష్మణ్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మామిడికాయల లోడ్ లారీ డ్రైవర్ ఎస్.కుమార్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికుల సహాయంతో కుమార్‌ను లారీ క్యాబిన్ నుంచి వెలికి తీసి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వాగులో పడి వృద్ధురాలి మృతి

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరి గొడ్డేటి వాగులో మహిళ మృతదేహం ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన వాగుకు చేరుకున్న పోలీసులు పక్క గ్రామమైన వెంచురాజు కండ్రిగకు చెందిన మన్నేమ్మ(70)గా గుర్తించారు. బంధువులకు సమాచారం చేరవేశారు. మన్నేమ్మకు మతిస్థిమితం లేదని, ఆదివారం ఇంటి నుంచి వెళ్లి మళ్లీ రాలేదని ఆమె కుమార్తె తెలిపారు. రెండు రోజుల క్రితం మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.